www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 2 డిసెంబర్ 2025
5
తిరుపతి



ఘనంగా యునైటెడ్ క్రిస్మస్ కార్యక్రమం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

బిషప్స్ డయాలసిస్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో యునైటెడ్ క్రిస్మస్ కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. బిషప్ గంజి ఎజ్రా అధ్యక్షతన రెవరెండ్ ఎంఎ అనిల్ పాల్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ మానవజాతి వద్ధికి యేసు చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో బిషప్ జాన్ పాల్ ,బిషప్ అబ్రహం, బిషప్ వీ జాషువా పాల్గొన్నారు.

'దిత్వా' సుడులు 'చలి' తెరలు

ముసురువానతో ఇళ్లకే పరిమితం

తిరుమలలో నిండిన డ్యాంలు

అత్యధికం తడలో, అత్యల్పం పాకాలలో..

జిల్లావ్యాప్తంగా అధికారులు అప్రమత్తం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

దిత్వా తుపాను జిల్లాను వణికిస్తోంది.. వెన్నులోనుంచి చలితెరలు వణుకు పుట్టిస్తున్నాయి.. ముసలీముతక పిల్లలు ఇళ్లకే పరిమితమయ్యారు.. తిరుమలలో భక్తులు గదులకే పరిమితం అయ్యారు. తిరుమలలో ఇప్పటికే అన్ని డ్యాంలు నిండాయి. అరణియార్, కల్యాణిడ్యాం నీటి మట్టాలను ఇరిగేషన్ అధికారులు సోమవారం పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా అధికారయంత్రాంగం అప్రమత్తతతో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

తుఫాన్ రెండవ రోజు సోమవారం ముసురు వర్షాలు కురిసాయి. వర్షాల వల్ల చెరువులు ఇప్పటికే కొంతవరకు నిండాయి. ప్రమాద స్థాయిలో ఉన్న చెరువులను తెగిపోకుండా ఉండేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ముఖ్యంగా అరణియార్ డ్యాంను జిల్లాయంత్రాంగం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది. డ్యాంలో భారీ ఎత్తున వర్షపు నీరు చేరడంతో గేట్లు ఎత్తివేయాలా లేదా అని ఇరిగేషన్ అధికారులు పరిశీలిస్తున్నారు. అలాగే రేణిగుంట మల్లిమడుగు డ్యామ్ గేట్లను పరిశీలించారు. కళ్యాణి డ్యాం నీటిమట్టాన్ని ఇరిగేషన్ అధికారులు సోమవారం పరిశీలించారు.

తిరుపతి నగరంలో ముసురు వర్షం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు నగరపాలక అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. తిరుపతి జిల్లాలో పలు మండలాల్లో ముసరు వర్షాలు కురిసాయి. ఉదయం 8 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నమోదైన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. అత్యధిక వర్షపాతం తడ మండలంలో 37.4, వరదయ్యపాలెం 35.8, బిఎన్‌కండ్రిగ 30.4, సూళ్లూరుపేట 24.0, ఓజిలి 20.8, పెళ్లకూరు 20.4, కే వి బి పురం 18.6, వాకాడు 17.8, చిల్లకూరు 17.0, దొరవారి సత్రం 17.2, గూడూరు మండలంలో16.8, నాయుడుపేట 16.4, ఏర్పేడు 15.2, చిట్టమూరు 14.6, వెంకటగిరి 14.4, బాలయ్యపల్లి 14.0, డక్కిలి 12.4, తొట్టంబేడు 11.8, కోట 11.8, నాగలాపురం 11.6, శ్రీకాళహస్తి 9.2, పిచ్చాటూరు 8.6, రేణిగుంట 7.8, వడమాల పేట 5.2, తిరుపతి రూరల్ 4.4, పుత్తూరు 3.4, తిరుపతి అర్బన్ 3.2, యర్రావారి పాలెం1.8, రామచంద్రపురం 1.6, చంద్రగిరి 1.4, చిన్న గొట్టికల్లు 1.2, పాకాల 0.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఆకాశం మేఘావృతమై ముసురువానతో శ్రామికులకు పనులు లేకుండా పోయాయి.

తుపానుతో నేతన్నలు బెంబేలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గత అక్టోబర్ నుండి తుఫాన్ల ప్రభావంతో మగ్గం గుంతల్లో నీరు వచ్చి చేనేతలు పనులు లేక

ఆకలితో పస్తులు ఉంటున్నారని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం గూడూరు కమిటీ సభ్యులు రాయవరం శ్రీనివాసులు, నారే వెంకటప్పయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ పరిధిలోని చెన్నూరు, విందూరు , రెట్టపల్లి, గూడలి, మెట్టు, శ్యామసుందరపురం, వంజివాక తదితర గ్రామాల్లో నేత కార్మికులు పనులు లేక ఆకలితో జీవనం గడుపుతున్నారన్నారు. సుమారు 15 వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేతలకు బియ్యం, నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్నారని, గూడూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎటువంటి సహాయక చర్యలు చేపట్టలేదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం చేనేతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాళంగి వంతెనను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయండి : ఆర్డీవో

ప్రజాశక్తి -దొరవారిసత్రం

కాళంగి నది పక్కన ఉన్న గ్రామ ప్రజలను అప్రమత్తం చేయాలని సూళ్లూరుపేట ఆర్ డి ఓ. కిరణ్మియ్ అధికారులకు సూచించారు. సోమవారం దిత్వా తుపాన్ సందర్భంగా కాళంగి వంతెనను ఆమె పరిశీలించారు. గ్రామంలోని ప్రజలు బయటకు రాకుండా చూడాలని ఆమె అధికారులకు తెలిపారు. అవసరం అయితే రాకపోకలను నిలిపివేయాలన్నారు..గిరిజనులు చేపల వేటకు వెళ్లకుండా చూడాలని అధికారులకు సూచించారు. వీరివెంట తహసీల్దార్ శ్యామలకుమారి, ఎమ్‌పిడిఓ గోవర్ధన్, ఏఈ చంద్రశేఖర్, ఎస్ఐ అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఉధృతంగా కారాకొల్లు వాగు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు)

దిత్వా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా మండలంలో వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో వాగులు వంకలు ఉధతంగా ప్రవహిస్తున్నాయి. మండల తహశీల్దార్ భారతి సోమవారం మండలంలో ఉన్న పలు గ్రామాలలో పర్యటించారు. కారాకొల్లు వాగు ఉధృతంగా ప్రవహించడాన్ని పరిశీలించారు.వాగు దాటి అవతలి వైపుకు వెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎఎస్ఒ ప్రసూన, విఆర్ఒ గోపిరెడ్డి పాల్గొన్నారు.

ఎంఎల్ఎకు ప్రోటోకాల్ పాటించరా..?

పల్లికొండేశ్వర ఆలయ ఈవోను ప్రశ్నించిన ఆదిమూలం

ప్రజాశక్తి - నాగలాపురం

'నేను సత్యవేడు నియోజకవర్గంలో రాజ్యాంగబద్ధంగా రెండుసార్లు ఎంఎల్ఏగా ఎన్నికైన వ్యక్తిని.. అలాంటిది నాకు ప్రోటోకాల్ పాటించరా..? దళిత ఎంఎల్ఏను అవమానసరుస్తారా' అని పల్లి కొండేశ్వర స్వామి ఆలయ ఈవో లతను సత్యవేడు ఎంఎల్ఏ కోనేటి ఆదిమూలం ప్రశ్నించారు. సోమవారం నాగలాపురం మండలం సురుటుపల్లి కొండేశ్వర స్వామి ఆలయ కార్యాలయానికి చేరుకున్నారు. ఈవో లత, ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేసన్ గురుకుల్‌పై ఆదిమూలం ధ్వజమెత్తారు. 'పల్లి కొండేశ్వర స్వామి ఆలయం పవిత్రమైనదని, ఈ ఆలయానికి ప్రోటోకాల్ తప్పనిసరిగా ఉంటుందని, భవిష్యత్‌లోనూ ప్రోటోకాల్ విషయంలో ఎలాంటి తప్పిదాలు జరగరాదు' అని అన్నారు. 'గతంలో రామచంద్రారెడ్డి ఈవోగా ఉన్నపుడు అతన్ని బదిలీచేసి, నిన్ను నా లెటర్‌ప్యాడ్‌తో ఈవోగా నియమించానని, ఈ పరిధిలో ఏడేళ్లు ఈవోగా కొనసాగుతావని, అలాంటిది ప్రదోషపూజల కరపత్రంలో నా పేరు తొలగిస్తారా?' అని ధ్వజమెత్తారు. ఆలయంలో జరిగే ఉత్సవాలకు పట్టు వస్త్రాలు సమర్పించడం సాంప్రదాయ పద్ధతిలో ఎంఎల్ఏ సమర్పించాలి, లేకుంటే ఛైర్మన్ సమర్పించాలని, సంబంధం లేని మూడో వ్యక్తి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాల తట్టను ఎలా తీసుకొస్తారు అని మండిపడ్డారు. ఈ పద్ధతి మీకు ఎవరు నేర్పించారంటూ ధ్వజమెత్తారు. ఆలయంలో ప్రోటోకాల్ కావాలి, సన్మానం చేసుకోవాలనే ఆశ, కోరిక తనకు లేదని, ఇలాంటివి మరో ఎంఎల్ఏకు భవిష్యత్‌లో జరగకుండా ఉండాలనేది తన లక్ష్యమన్నారు. భారత రాజ్యాంగం ఇచ్చిన చట్టాన్ని ఉల్లంఘించితే సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. ఈ ఆలయానికి బాధ్యతగల ముఖ్య అధికారిగా ఇలా చేయడం మంచిది కాదన్నారు. ట్రస్టు బోర్డు అనేది ఈరోజు వస్తుంది, పోతుందని, కోర్టులో ట్రస్టు బోర్డుపై కేసు ఉన్నపుడు ఎలా దొంగతనంగా ప్రమాణం చేయిస్తారని ప్రశ్నించారు. ఈ విషయంపైనా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు.

ముక్కంటిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి సోమవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

వైకుంఠ ద్వార దర్శనాలకు ముగిసిన ఈడిప్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో

వైకుంఠ ద్వార దర్శనాలకు ఈడిప్ రిజిస్ట్రేషన్ సోమవారంతో ముగిసింది. తిరుమల వైకుంఠ ఏకాదశి, ద్వాదశి తో పాటు జనవరి 1న శ్రీవారి దర్శనం కోసం తొలి మూడు రోజులకు 1.8 లక్షల టోకెన్ల కోసం 24 లక్షల మంది భక్తులు నమోదు చేసుకున్నారు. నవంబర్ 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సోమవారం సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ ప్రక్రియ కొనసాగింది. డిసెంబర్ 30న వైకుంఠ ఏకాదశి, 31న ద్వాదశి, జనవరి 1న మూడు రోజులకు ఈ డిప్ ద్వారా భక్తులకు దర్శన టోకెన్లను కేటాయించారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ డిప్‌లో పాల్గొన్న వారికి సెల్ ఫోన్ లకు మెసేజ్ లు రానున్నాయి.అత్యధికంగా టిటిడి మొబైల్ యాప్ ద్వారా 13.4 లక్షల మంది భక్తులు పేర్లను నమోదు చేసుకున్నారు. టీటీడీ వెబ్ సైట్ లో 9.3లక్షలు, ఏపీ గవర్నమెంట్ వాట్స్ యాప్ ద్వారా 1.5 లక్షల మంది భక్తులు పేర్లు నమోదు అయ్యాయి. మిగిలిన ఏడురోజులు జనవరి 2 నుండి 8వ తేదీ వరకు సర్వదర్శనం యథాతథంగా ఉంటుంది. చివరి 7 రోజుల్లో రోజుకు 15వేల రూ 300 దర్శనం టిక్కెట్లు, రోజుకు వెయ్యి శ్రీవాణి టిక్కెట్లు....డిసెంబర్ 5వ తేదీ ఆన్లైన్ లో విడుదల చేయనున్నారు. చివరి 3 రోజులు జనవరి 6,7,8 తేదీల్లో స్థానికుల కోసం....రోజుకు 5వేల టోకన్లు డిసెంబర్ నెల 10 వ తేదీ విడుదల చేస్తారు. వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు.

పైలెట్ ప్రాజెక్టుగా లీన్ కన్‌స్ట్రక్షన్స్ : మంత్రి నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'మున్సిపాలిటీల్లో మొదటగా ఒకచోట పైలెట్ ప్రాజెక్టుగా లీన్ కన్‌స్ట్రక్షన్స్ చేపడతామని, మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనులకు వినియోగించుకుంటాం' అని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. తిరుపతి ఐఐటి కాలేజీ 8వ ఇండియన్ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్ రెండో రోజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐఐటి డైరెక్టర్ కెవెన్ సత్యనారాయణ, లీన్ కన్‌స్ట్రక్షన్ సభ్యులు, ప్రొఫ శ్రీసర్లు ఘన స్వాగతం పలికారు. ఐఐటిలోని టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్‌ను పరిశీలించి టెక్నాలజీ వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ నిర్మాణ రంగంలో వృథా సమయాన్ని తగ్గించడంతో డబ్బు ఆదా అవుతుందన్నారు. నిర్మాణరంగ ప్రాజెక్టులు సకాలంలో, మంచి నాణ్యతతో పూర్తవుతాయన్నారు. మున్సిపల్, పట్టణాభివృద్ధిలో ఈ పని విధానం చాలా సందర్భోచితంగా ఉపకరిస్తుందన్నారు. ఐఎల్‌సిఇ ప్రయత్నాలను అభినందిస్తున్నాన్నారు. మూడు రోజుల పాటు జరిగే సెమినార్‌లో పలు అంశాలపై చర్చించి ఉపయోగకరమైన ఫలితాలను సాధించాలన్నారు.

బాంబు బెదిరింపులు చేస్తుంది ఎవరు?

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలోని రెండు హోటళ్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. పోలీసులు అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం తిరుపతి కపిలతీర్థం సమీపంలోని రాజ్ పార్క్ హోటల్‌కు గుర్తుతెలియని వ్యక్తులు మెయిల్ ద్వారా హోటల్‌ను ఆర్డీఎక్స్ తో పేల్చేస్తామంటూ సమాచారం ఇచ్చారు. దీంతో హోటల్ యజమాన్యం అలిపిరి పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. అప్రమత్తమైన పోలీసులు, అలిపిరి ఎస్సై అజిత ఆధ్వర్యంలో బాంబు స్క్వాడ్ ముమ్మర తనిఖీలు చేపట్టారు. సంబంధిత హోటల్ నిత్యం వేలాది మంది భక్తులు తిరగాడే కపిలతీర్థంకు అత్యంత చేరువలో ఉండడంతో అటు పోలీసులు ఇటు భక్తులు ఆందోళన చెందారు. అయితే ఇది ఆకతాయిలు చేస్తున్న పనా? కాదా? అన్నది పోలీసులు తేల్చకపోవడం గమనార్హం. గతంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగానూ ఇదే విధమైన మెయిల్స్ వచ్చాయి. అయితే మెయిల్స్‌కు కారకులైన వారిని ఇంతవరకూ అరెస్టు చూపలేదు.

తిరుపతి జిల్లాలో పింఛన్ల పంపిణీ శాతం 92.78

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ తిరుపతి జిల్లాలో 92.78 శాతంగా నమోదయ్యింది. తిరుపతి జిల్లా పరిధిలోని 33 మండలాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారులు ఇళ్ల వద్దనే పంపిణీ చేశారు. ముఖ్యంగా ద్విత్వా తుపాను కారణంగా తీర ప్రాంతాల్లోని మండలాలలో పింఛన్ల పంపిణీలో సాంకేతిక లోపం, రవాణా సమస్యలు ఎదురవడంతో 92.78 శాతం పింఛన్ పంపిణీ చేయగలిగామని డిఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు వివరించారు. మిగిలిన లబ్ధిదారులందరికీ పింఛన్లను అందిస్తామన్నారు.

ప్రతి పేద కుటుంబానికీ నేరుగా వారి ఇంటి వద్దకే వెళ్లి స్వయంగా పింఛన్లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుపతి జీవకోన 48, 49 వార్డులలో ఎన్టీఆర్ భరోసా భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తిరుపతి కేంద్రంగా రాయలసీమ జోన్‌ను టూరిజం, ఇండస్ట్రీస్‌తో అభివృద్ధి చేస్తామన్నారు. నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ పరిశ్రమలను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. గత 17 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 51వేల కోట్ల రూపాయల పింఛన్లను పంపిణీ చేశామన్నారు. తిరుపతి జిల్లాలో నెలకు 2.62 లక్షల మందికి రూ.113 కోట్ల రూపాయలను అందిస్తున్నామన్నారు. తిరుపతి చుట్టుపక్కల నూతన టౌన్‌షిప్‌లు, కన్వెన్షన్ సెంటర్లు, టూరిజం హబ్‌లు ఏర్పాటుచేయడానికి క్యాబినెట్ ఆమోదం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ రామ్మోహన్, డిఆర్‌డిఏ పీడీ శోభన్‌బాబు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సాగింది.

సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డిపై విచారణకు ఆదేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసి సస్పెన్షన్‌కు గురైన ఆనంద్ రెడ్డి హైకోర్టుకు వెళ్లి డిప్యూటేషన్ పేరుతో మళ్లీ విధుల్లో చేరాడని, అతను అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుపతిలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ ఆనందరెడ్డి వ్యవహార శైలి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని, దీన్ని స్టాంపులు డిఐజి శాఖ అధికారులు విచారణకు ఆదేశించారన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది కలిగించేలా వ్యవహరించిన ఆనందరెడ్డి పై విచారణ తర్వాత చర్యలు చేపడతామని హెచ్చరించారు. అలాగే శ్రీవారి కల్తీ నెయ్యి విషయంలో దోషులు జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. పరకామణి కేసులో కూడా నిందితులు జైలుకు వెళ్లక తప్పదని, దాని వెనక ఉన్న వారందరినీ ప్రభుత్వం వదిలిపెట్టబోదన్నారు.

బాలాజీ రైల్వే డివిజన్ అజెండా సిఎం దృష్టికి తీసుకెళతాం

బాలాజీ రైల్వే డివిజన్ కోసం చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, డివిజన్ ఏర్పాటుకు సహకరించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సాధన కమిటీ కన్వీనర్ కుప్పాల గిరిధర్‌కుమార్ తీసుకెళ్లారు. మంత్రి స్పందిస్తూ తప్పనిసరిగా సిఎం దృష్టికి తీసుకెళతామని, మంత్రి లోకేష్ ఢిల్లీ వెళుతున్నారని తెలిపారు. నాయుడుపేట, సూళ్లూరుపేట, తడ, నగరి, పుత్తూరు ప్రాంతాలను నూతనంగా ఏర్పడుతున్న దక్షిణ కోస్తా రైల్వేజోన్‌లో కలిపితే కార్గో టెర్మినల్ లాంటి లోడింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తే వ్యాపారం అభివృద్ధి చెందుతుందని మంత్రికి వివరించారు.

అనగానిని కలిసిన రంగినేని

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ను శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంగినేని చెంచయ్య నాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి తిరుపతి పర్యటనకు విచ్చేయగా రంగనేని శాలువా, పూలమాలతో సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మేలు చేకూర్చే పలు అభివద్ధి పనులపై మంత్రితో చర్చించారు. రంగినేని తోపాటు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

పొలం వివాదంలో దళిత కుటుంబంపై దాడి

ప్రజాశక్తి - వెంకటగిరి

పొలం వివాదంలో ఓ దళిత కుటుంబం పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన డక్కిలి మండలం చెన్న సముద్రం (తురకపల్లి) గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు డక్కిలి వరలక్ష్మి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.... వరలక్ష్మి కుటుంబానికి చెందిన వారసత్వ భూమిని తనకు, ఆమె కుమారులకు తెలియకుండా గతంలో భర్త తిరుపాల్లు మిట్టపాశం గ్రామానికి చెందిన ఎం శేఖర్ నాయుడు తీసుకెళ్లి పొలంను రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ విషయం తెలిసినప్పటి నుంచి జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకెళ్లామన్నారు. అప్పట్లో జరిగిన వివాదం పై డక్కిలి పోలీస్ స్టేషన్లో శేఖర్ నాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందన్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఈ వివాదస్పద పొలంలో శేఖర్ నాయుడు తమకు తెలియకుండా వరి నాట్లు వేశాడని, దీన్ని తిరుపాల్ కుమారుడు చక్రి వీడియో తీస్తుండగా ఎం.శేఖర్‌నాయుడు, వేముల రమేష్, రంగినేని శివరాజ, పోలేరయ్యలు దాడి చేశారని వాపోయింది. తనను, తన భర్తను, కుమారుని వరినాట్లు బురదలో తొక్కి కులం పేరుతో దూషించారని రోదించింది. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితురాలు కోరుతోంది. ఎస్ఐ శివశంకర్ స్పందిస్తూ ఈ విషయమై కేసు నమోదు కాలేదని చెప్పారు.

పెంచలయ్య హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి : ఎస్‌వైఎ

ప్రజాశక్తి - వెంకటగిరి

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నగరంలో తీవ్రంగా పోరాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న సామాజిక సేవకుడు పెంచలయ్య శుక్రవారం దారుణహత్యకు గురయ్యారని, హంతకులను కఠినంగా శిక్షించాలని సింహపురి యూత్ అసోసియేషన్(ఎస్‌వైఎ) డిమాండ్ చేస్తోందని గుడిమెట్ల ఉదయ్‌కుమార్ అన్నారు. మాఫియా చేతుల్లో అత్యంత దారుణంగా హత్యకు గురికావడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పనిచేసే కార్యకర్తలు ఎదుర్కొనే ప్రమాదానికి గట్టి నిదర్శనమన్నారు. పెంచలయ్య తన ప్రాణానికి ప్రమాదం ఉందని ఫిర్యాదు చేసినా, పోలీసు శాఖ స్పందించకపోవడం విచారకరమన్నారు. సోమవారం సాయంత్రం భగత్‌సింగ్ విగ్రహం వద్ద క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. వామపక్షాలు, విద్యార్థిసంఘాలు తలపెట్టిన బంద్‌కు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వెంకటేష్, పోచినేని ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం వద్దు : ఎంపీ

తిరుపతి సిటీ : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో తరచూ చోటు చేసుకుంటున్న ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో కీలక ప్రశ్న వేశారు. ఏడాదికాలంలో తిరుపతి పార్లమెంట్ పరిధిలోని నాయుడుపేట, సత్యవేడు, శ్రీకాళహస్తితో పాటు పలు ఘటనలు తీవ్రంగా తనను కలచివేశాయన్నారు. పరిశుభ్రత లోపం, పాడైన ఆర్‌ఒ ప్లాంట్లు, శుభ్రం చేయని నీటి ట్యాంకులు, వంటగది పరిశుభ్రత లోపాల వల్ల విద్యార్థులు అనారోగ్యానికి కారణమయ్యిందన్నారు. కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్‌చౌదరి స్పందిస్తూ అస్వస్థతకు గురైన మాట వాస్తవమని, అయితే అందరికి వైద్య చికిత్స అందించి డిశ్చార్జి చేశామన్నారు. అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో లోపాలను సరిదిద్దామన్నారు. ప్రతిరోజూ విద్యార్థులకు పోషకాహారంతో కూడిన వేడి భోజనం అందించడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతని స్పష్టం చేశారు. వండిన ఆహారాన్ని ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్య కమిటీ సభ్యులు రుచి చూడాలన్నారు. ఆహార నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో పరీక్షించాలన్నారు.

సిఐటియు గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 30 నుంచి జనవరి నాలుగో తేదీ వరకూ విశాఖపట్నంలో జరగనున్న 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని చంద్రగిరి పట్టణంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్.జయచంద్ర ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు. దేశ నలుమూలల నుంచి కాకలు తీరిన కార్మిక యోధులు 2,500 మంది ప్రతినిధులు ఈ మహాసభకు విచ్చేస్తారని తెలిపారు. జనవరి 4న విశాఖపట్నంలో పెద్ద బహిరంగసభ జరుగుతుందన్నారుర. వేలాదిగా కార్మికులు ఈ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి చిన్న బాబు, చంద్రగిరి మండల కన్వీనర్ యుగంధర్, ప్రకాష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

రోటరాక్ట్ స్టార్ ఆఫ్ ది మంత్ గా దీపిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రోటరాక్ట్ స్టార్ ఆఫ్ ది మంత్ గా శ్రీకాళహస్తికి చెందిన గివింగ్ హాండ్స్ ఫౌండేషన్ వద్ధాశ్రమ నిర్వాహకురాలు సాయి దీపిక ఎంపికయ్యారు. క్షణికావేశం అనే కార్యక్రమంలో ఆదివారం తాడిపత్రి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రోహిత్ చౌదరి సాయి దీపికకు రోటరాక్ట్ స్టార్ ఆఫ్ ది మంత్ అవార్డును అందజేశారు. సాయి దీపిక అతిపిన్న వయస్సులో వద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి 25 మంది వద్ధులకు ఆశ్రయం కల్పించడంతో పాటు ఉచిత భోజనం, వైద్య సదుపాయాలు కల్పిస్తోంది. అంతేకాకుండా రోటరాక్ట్ యూత్ క్లబ్ ప్రెసిడెంట్ గా ఉంటూ వివిధ పాఠశాలలు, కళాశాలల్లో సామాజిక అంశాల మీద విద్యార్థినులను చైతన్య పరుస్తోంది. ఆమె అందిస్తున్న సేవలకు గుర్తుగా రోటరాక్ట్ స్టార్ ఆఫ్ ది మంత్ గా ఎంపికయ్యారు.

మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలని తిరుపతి ఈఎస్ఐ రిటైర్డ్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. సోమవారం సిఐటియు, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ టి టి డబ్ల్యూ ఎస్ వర్క్ షాప్ ట్రైన్ వర్క్ షాప్ 259 బ్యాచ్ ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా ఈ ఎస్ ఐ హాస్పిటల్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె శ్రీధర్ సర్జన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా తహసునిసాబేగం మాట్లాడుతూ ఈ శిక్షణ 28 రోజుల పాటు ఆన్‌లైన్‌లో ఉచితంగా ఇచ్చామన్నారు. ఆఫ్ లైన్ లో రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. త్వరలోనే ఇంకొక బ్యాచ్ స్టార్ట్ చేస్తామన్నారు. వివరాల కోసం సంప్రదించవలసిన నంబరు 9160091606 అని తెలిపారు. ఈ కార్యక్రమానికి నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కదం కష్ణమూర్తి, నేషనల్ బోర్డ్ మెంబర్ శ్రీధర్ విఠలం, ఇంపాక్ట్ క్లబ్ సెక్రటరీ ధాత్రి ఇంపాక్ట్ ట్రైనర్స్ మునీంద్ర, నాదముని, మాధవి పాల్గొన్నారు.

వాతావరణ సమతుల్యత పాటించాలి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో క్లైమేట్ రెసిలెంట్ సప్లై చైన్స్ అనే అంశంపై లక్నోకు చెందిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరమణయ్య ముఖ్య అతిథిగా అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించి నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. వాతావరణంలో మార్పులకు అనుగుణంగా పర్యావరణ వ్యవస్థను పటిష్టం చేయడం, వాతావరణ సమతుల్యత తప్పినప్పుడు తక్షణ కాలంగా అమలు చేయాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వాసు, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటరమణయ్యకు స్వాగతం పలుకుతున్న విద్యార్థిని

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్

హాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షులు ఐరాల లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి డాక్టర్ జయ కుమార్, ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అబ్జర్వర్లు డాక్టర్ దామోదర్, రాంభూపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు భాస్కరయ్యలు అధితులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జయ కుమార్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు పార్టీ నాయకులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎంపిక కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ముందుగా ఆంధ్రప్రదేశ్లో అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ నాయకుల అభిప్రాయాలు సేకరించి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల నియామకానికి శ్రీకారం చుట్టుతున్నామన్నారు. దశలవారీగా మండల కమిటీలు, బూత్ కమిటీల నియామకం చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఐరాల లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షణ్ముగం సేవలు అమూల్యం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ వాచ్ అండ్ వార్డ్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న వి.షణ్ముగం వాచ్మెన్గా 27 సంవత్సరాలపాటు విధులు నిర్వర్తించి, రిటైర్మెంట్ అవుతున్న సందర్భంలో డిపార్ట్మెంట్ వారందరూ అతనిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షణ్ముగం అందించిన సేవలు యూనివర్సిటీలో గుర్తుండిపోతాయని తెలిపారు.

పాడి రైతుకు సబ్సిడీతో పశువుల దాణా

ప్రజాశక్తి-ఏర్పేడు: మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రం పరిధిలో పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశువుల దాణ ఇవ్వడం జరుగుతుందని పశు వైద్యాధికారి డా.జి మోహన్ కుమార్ తెలిపారు. 50 కేజీల బ్యాగ్ పూర్తి ధర రూ. 1,110 కాగా రాయితీతో రైతు వాటా రూ.555 ఇవ్వనున్నారని ఆమె తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డి వారి గురువారెడ్డి చేతుల మీదుగా సబ్సిడీ దాణాని సోమవారం రైతులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, రావెటి సుబ్రమణ్యం, గుణ యాదవ్, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - సత్యవేడు: నాణ్యమైన విత్తనాలతో సాగులో అధిక దిగుబడిని సాధించవచ్చని తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. సోమవారం సత్యవేడు మండల పరిధిలోని మదనంబేడు రైతు సేవా కేంద్రంలో మండల రైతు ఉత్పత్తిదారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పరీక్షించుకోవడానికి రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలన్నారు. వాణిజ్య పంటల సాగు వైపు రైతులు మళ్ళాల్సి ఉందన్నారు. తదనంతరం రైతు ఉత్పత్తి దారుల సంస్థకు సభ్యులు 207 మంది రైతులకు ఉచితంగా 416 వేరుశనగ బస్తాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి త్రివిక్రమరావు, శ్రీకాళహస్తి రైతు ఉత్పత్తిదారుల అసోసియేషన్ చైర్మన్ రెడ్డెప్ప భక్తరెడ్డి, స్థానిక రైతు ఉత్పత్తిదారుల కోఆర్డినేటర్ జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -కోట: కోట పట్టణానికి చెందిన పోలే రమణయ్యకి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 2,23,815 రూపాయలను బాధిత కుటుంబానికి టీడీపీ తిరుపతి పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రమణయ్య కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్.నౌషద్ భాష, ఎంపీటీసీ సభ్యులు దారా సురేష్, తల్లం శ్రీనివాసులు, నంద మోహన్, కోట మండలం టీడీపీ సోషల్ మీడియా అధ్యక్షులు మీజూరు మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - సత్యవేడు : మదనంబేడు గ్రామ గిరిజనులకు ఇండ్ల జాగాలు కేటాయించి, అన్ని మౌలిక వసతులతో గృహాలు నిర్మించి ఇవ్వాలని సత్యవేడు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సిపిఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్, గిరిజనుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రమేష్ మాట్లాడుతూ గ్రామంలో సుమారు 35 కుటుంబాలకు పైగా గిరిజనులు నివసిస్తూ ఉండగా, ఒక్కొక్క గుడిసెలో సుమారు నాలుగు కుటుంబాల చొప్పున నివసిస్తూ ఉండటం శోచనీయమన్నారు. వర్షానికి ఉరుస్తున్న గుడిసెలలో వారి జీవనం ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రత్యేక డ్రైవ్లని, సర్వేలని, ఇండ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ, అవి ఆచరణలోకి రావడం లేదన్నారు. అనంతరం సత్యవేడు డిప్యూటీ తహశీల్దార్కు గిరిజనుల తరపున వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ మునుస్వామి, కెపిఎస్ మండల కార్యదర్శి విజయ్ భాస్కర్, అంజేరమ్మ, ఎలుమలై, చిన్న రాసు, జ్యోతి, నదియా, శేఖర్, పోలమ్మ, మనీ, మురళి తదితరులు పాల్గొన్నారు.

గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

ప్రజాశక్తి -కోట: గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని లేదా జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రం, కోట బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం గూడూరు రెవిన్యూ డివిజన్, వెంకటగిరి నియోజకవర్గంలోని మండలాలను ముక్కలు ముక్కలుగా చేసి కలవాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోను, బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి మండలాలను తిరుపతి జిల్లాలోను కలిపి అస్తవ్యస్తంగా చేశారని ఆరోపించారు. గూడూరు పాత రెవిన్యూ డివిజన్ను నెల్లూరు జిల్లాలో కలిపేంతవరకు ఉద్యమిస్తామని బిజెపి నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కోర్ కమిటీ సభ్యులు గిరిధర్ రెడ్డి, కోట మండలం బిజెపి అధ్యక్షులు సురేష్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పామంజి కృష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబరీష్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష గూడూరు జిల్లా కేంద్రం చేయాలని లేని పక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలని, గతంలో చంద్రబాబు నాయుడు లోకేష్

ఇచ్చిన హామీని నెరవేర్చాలని గూడూరు డివిజన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు పవన్ వెల్లడించారు. సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ ఉపాధ్యాయులతో టవర్ క్లాక్ సెంటర్ నుండి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వర్షంలోనే తడుస్తూ ఉపాధ్యాయులు, మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. తిరుపతి వద్దు నెల్లూరు ముద్దు అంటూ నినాదాలతో పట్టణం మారుమోగింది. సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రభాకర్, సి.వి.ఆర్ కుమార్, నారాయణ, బాలకృష్ణ రాజు, వేగూరు రాజేంద్ర, పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

జిఎస్డబ్ల్యూఎస్ అధికారిగా మురళి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: డిప్యూటీ ఎంపీడీవో స్థాయి జిఎస్డబ్ల్యూఎస్ అధికారిగా ఎన్.మురళి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన తిరుపతి రూరల్ పంచాయతీలో గ్రేడ్ వన్ సెక్రటరీగా పనిచేస్తూ చిన్నగొట్టిగల్లుకు బదిలీపై వచ్చారు. ఎంపీడీవో గిడ్డయ్యకు జాయినింగ్ రిపోర్టును అందజేశారు.

అల్లీబాషా బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -కోట : కోట మండల పరిషత్ కార్యాలయంలో మండల గ్రామ సచివాలయం వార్డు ప్రత్యేక అధికారిగా సోమవారం అల్లి భాష స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. చిల్లకూరు మండలంలో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ వన్ నుండి పదోన్నతి పొంది, మండల గ్రామ సచివాలయం వార్డు ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారు.

ఫేక్ సర్టిఫికెట్లపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : గత ప్రభుత్వ హయాంలో ఎనిమల్ హస్బెండరీ పోస్టుల నియామకంలో, కొంతమంది నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగాలు పొందారని ఎన్ఎస్యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున ఆరోపించారు. కంప్యూటర్ ఆపరేటర్లుగా, డేటా ఆపరేటర్గా అవుట్సోర్సింగ్ విధానంలో విధులు నిర్వర్తిస్తూ, అదే కాలంలోనే రెగ్యులర్ కోర్స్ చేసి ఎక్స్పీరియన్స్ కింద కొన్ని మార్కులు పొందారని, ఎగ్జామ్లో వచ్చిన మార్కులతో ఉద్యోగం పొందారన్నారు. గత ప్రభుత్వంలో నియమించబడిన సచివాలయంలోని ఎనిమల్స్ హస్బండరీ విభాగంలో 1200 పైచిలుకు నకిలీ ఉద్యోగులుగా చలామణి అవుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం స్పందించి నకిలీ సర్టిఫికెట్లపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వారిని తక్షణమే ఉద్యోగాల నుంచి తొలగించి, కొత్త నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పశు వైద్య శాఖ మంత్రి, పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించాలన్నారు.

అవగాహనతో ఎయిడ్స్ వ్యాధికి చెక్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గత 15 సంవత్సరాలుగా ఎయిడ్స్పై అవగాహన కల్పిస్తున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఈ.చంద్రశేఖర్ తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుందో, నివారణ ఎలా చేపట్టాలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జరీనా, దీప్తి, సురేష్, అశోక్, హెడ్ నర్సు రమాదేవి, అన్నా దొరై, సోమశేఖర్, చెంచమ్మ, హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసులు, అధ్యాపక సిబ్బంది మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులను చిన్నచూపు చూడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసులు, శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఆర్. సి. రోడ్ లోని కార్మిక రాజ్య బీమా (ఇఎస్ ఐ)ఆసుపత్రిలో సోమవారం ఎయిడ్స్ వ్యాధి పట్ల రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. శ్యాంబాబు, ఇతర డాక్టర్స్ మాట్లాడుతూ వైరస్ వల్ల సోకే ఎయిడ్స్ వ్యాధి గతంలో ప్రాణంతకంగా ఉండేదని, నేడు ఆధునిక వైద్యం, ఎన్నో మందులు అందుబాటులోకి వచ్చాయాన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఆర్ఎంఓ డాక్టర్ జి.శివ మహేశ్వర, స్పెషలిస్ట్ డాక్టర్స్ కె.పద్మావతి, డాక్టర్ కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మహతి ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పుట్టబోయే శిశువులకు వ్యాధి సోకకుండా నెవిరిపిన్ సిరప్ వినియోగం అవసరమని సూచించారు. హెచ్ఐవి నిర్మూలనకు జిల్లా వైద్య సిబ్బంది చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవి బాధితులకు సంఘీభావంగా నిర్వహించిన ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, ఎస్విఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు, దిశ సిబ్బంది నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం తిరుపతి డిఎమ్ అండ్ హెచ్ఓ ఆధ్వర్యంలో నిర్వహించించిన ఎయిడ్స్ అవగాహన ర్యాలీలో కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సి సి కాడెట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ప్రిన్సిపాల్ సి.ప్రకాష్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి కోలా కృష్ణకిశోర్, ఎన్సిసి సిటిఓ ఈ.లోకేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.శ్రీ వేంకటేశ్వర వేద విద్యాలయం ఎన్సిసి విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమిక్ డీన్ ఆచార్య గోళి సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి ఎయిడ్స్ వ్యాధి పైన పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థుల పైన ఉన్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ విభాగ డీన్ డా.ఉమేష్ సహ సంయోజకులు డా.నీలకంఠం డా.భరతశేఖరాచార్యులు,పీఆర్ఓ డా.టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరపతి సహకార సంఘంలో స్కామ్

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు : ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం, చిన్నగొట్టిగల్లు శాఖలో కోట్ల రూపాయల స్కాం జరిగిందని మండల టీడీపీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి ఆరోపించారు. సోమవారం చిన్నగొట్టిగల్లు ప్రాథమిక వ్యవసా య సహకార పరపతి సంఘం శాఖలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సహకార సంఘంలో రూ.2.37 కోట్ల వరకు స్కాం జరిగిందని, వన్ గ్రామ్ గోల్డ్ తాకట్టు పెట్టి రూ.72 లక్షలు, అలాగే స్వల్ప, దీర్ఘకాలిక రుణాల్లో రూ.1.63 కోట్లు మాయం చేశారని తెలిపారు. ఈ స్కామ్తో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న సెక్రెటరీ జగదీష్, అప్రైజర్ రాజా సురేష్, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ సహదేవ రెడ్డి, పిఐసి ఛైర్మన్ ఉమాపతి, రెడ్డమ్మ, రుతున్లపై క్రిమినల్ కేసులు నమోదయినట్లు తెలిపారు. ఇప్పటివరకు సెక్రటరీ జగదీష్, అప్రైజర్ రాజా, సురేష్లు అరెస్టయ్యారని తెలిపారు. మాజీ సింగల్ విండో అధ్యక్షులు సహదేవ రెడ్డి, రైతుల సొమ్ము కాజేసి విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తులను పెంచి పోషిస్తున్నది వైసీపీ నేతలేనని స్పష్టం చేశారు. మిగిలిన వారిని కూడా అరెస్ట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్, క్లస్టర్ ఇంచార్జ్ కొట్టే శివకుమార్, సంద్ర మోహన్ రెడ్డి, శేఖర్, చిట్టి చర్ల సహదేవ రెడ్డి, నాయకులు మల్లికార్జున రెడ్డి మల్లికార్జున గువ్వల నాగిరెడ్డి, జనసేన పార్టీ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మండల టీడీపీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళి

జాతీయ స్థాయి ఖోఖో పోటీకి అర్చన ఎంపిక

ప్రజాశక్తి -ఏర్పేడు : రాజస్థాన్లో జరిగే నేషనల్ ఖోఖో పోటీలకు పంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విదార్థిని ఎం.అర్చన రెడ్డి ఎంపికయింది. నవంబర్ 29న అనకాపల్లి జిల్లా, లంకెలపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో(అండర్- 14 విభాగం) ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున ఎం.అర్చన రెడ్డి, కే.దీప మొదట స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. దీంతో అర్చన రెడ్డి నేషనల్ ఖోఖో పోటీలకు అయింది.

ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఆటానమస్), ఇంట్రడక్షన్ టు క్వాంటమ్ కంప్యూటింగ్ అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్డిపి) సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, జేఎన్టీయూఏ, అనంతపురం ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ సెంటర్ (ఎఫ్డిసి)లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. డిసెంబర్ 1 నుండి 5 వరకు జరిగే ఈ కార్యక్రమంలో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాముఖ్యత, ప్రాథమిక సిద్ధాంతాలు, ఆధునిక పరిశోధనా ధోరణులు, అనువర్తనాలపై నిపుణులపై అధ్యాపకులకు శిక్షణ అందించనున్నారు. సాంకేతిక రంగంలో వేగంగా విస్తరిస్తున్న క్వాంటమ్ టెక్నాలజీలపై అధ్యాపకులు అవగాహన పెంపొందించుకోవడం, బోధనలో నూతన అభ్యాసాలను ప్రవేశపెట్టడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు. తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల నుండి 40 మంది అధ్యాపకులు హాజరయ్యారు, ముఖ్య అతిథిగా డాక్టర్ రితీష్ కుమార్ గంగ్వార్, అసోసియేట్ ప్రొఫెసర్, ఐఐటి తిరుపతి ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో మా భూమిని అమ్మేశారు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): మున్సిపల్ ఉద్యోగిగా ఉన్న తన భర్త దశరథ రామయ్య తిరుపతిలో 1976లో ఉద్యోగం చేస్తున్న సమయంలో శ్రీనివాసపురం సర్వేనెంబర్ 323 లో శ్రీనివాస కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ వారి వద్ద డబ్బులు వెచ్చించి 116 అంకణాలు కలిగిన 61వ ప్లాట్ కొనుగోలు చేయడం జరిగిందని, తమ ప్రమేయం లేకుండా ఫోర్జరీ సంతకాలు చేసి బట్టు చంద్రపాల్ అనే వ్యక్తి అమ్మి వేశాడని దశరథ రామయ్య భార్య ఇందిరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె మాట్లాడారు. తన భర్త వద్ద గుమస్తాగా పని చేసిన బట్టు చంద్రపాల్ 1991లో కడప రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఫోర్జరీ సంతకాలతో జిపిఏ సృష్టించి అమ్మకాలు జరిపాడన్నారు. సదరు ప్లాట్ నేడు ఇంకొక వ్యక్తికి కూడా మారిందన్నారు. 2018లో తన భర్త మరణీనంతరం హైదరాబాదులోని కూతురు వద్ద ఉంటున్నానని, తమ ఫ్లాట్ కు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని, ఫోర్జరీ సంతకాలతో ఇంతటి దారుణ మోసానికి ఒడిగట్టిన చంద్రపాల్పై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకుని, తమ భూమిని తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రమశ్రీ, రమేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : ధనలక్ష్మి శ్రీనివాసన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన తొలి జాతీయస్థాయి మూట్ కోర్ట్ పోటీలో డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ధరణి, యశ్వంత్, జ్ఞానిలు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలో తమ సమగ్ర న్యాయ పరిశోధన నైపుణ్యాన్ని ప్రదర్శించి “బెస్ట్ రీసెర్చర్ అవార్డు”ను సాధించడం ద్వారా సంస్థకు గౌరవం తెచ్చారు. వారిని డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి, మూట్ ట్రైనర్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ అతిర, అక్షయ్, కమిటీ సభ్యులు, అధ్యాపకులు అభినందించారు.

నడింపల్లిని దత్తత తీసుకున్న ఎన్ఎస్ఎస్

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నడింపల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా, వారు వారం రోజుల పాటు అక్కడ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నడింపల్లిలో సోమవారం ప్రారంభ సభ ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భక్త వత్సలం మాట్లాడుతూ, జాతీయ సేవా పథకం ముఖ్య ఉద్దేశం విద్యార్థి యువత వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని సేవ ద్వారా విద్య అనే సూత్రంతో అభివృద్ధి చేయటమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగర్, కె.పుండరీక నాయుడు, జగ్గయ్య నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన శ్రీ హయగ్రీవ కళా వేదికలో సోమవారం భగవద్గీత ఆవిర్భావ దినోత్సవం గీతా జయంతిని కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు విభాగ విశ్రాంత అధిపతి దామోదర్ నాయుడు , విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆదిత్య శర్మలు మాట్లాడుతూ భగవద్గీత భారతీయ సంస్కృతికి, జీవన విధానానికి నిలువుటద్దమని తెలపారు. కళాశాల విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను పారాయణం చేసి అందరిని ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందిస్తూ విద్యార్థులు భగవద్గీత సారాన్ని గ్రహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ప్రియవర్ధన బాబు, డాక్టర్ కె.వెంకట రమణమ్మ, డాక్టర్ వి.ప్రసన్న లక్ష్మీ, పి.జి. లావణ్య, వై. యమున, డాక్టర్ సి.ఎల్. చెన్నా రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో సోమవారం గీతా జయంతిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భువనేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ విద్యార్థిలను ఉద్దేశించి మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలు ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని సూచించారు. ముఖ్య అతిథులుగా తిరుపతి ఇస్కాన్ నుంచి విచ్చేసిన చంద్రబాబు, విష్ణు ప్రియలు విద్యార్థినులకు గీతలోని తాత్వికతను తెలియజేశారు. ఈ భగవద్గీత పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, కార్యాలయ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పాకాల: గీతా జయంతిని పరిష్కరించుకొని, తిరుపతి జిల్లా, పాకాల శ్రీ రామకృష్ణ ఆశ్రమంలో సోమవారం గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మండలి సభ్యులు భగవద్గీత పారాయణం చేశారు. భగవద్గీతా పారాయణంతో దుఃఖాలు నశించి సుఖ శాంతులు కలుగుతాయని, సంసార బంధనాల నుంచి విముక్తి లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ ఆశ్రమ నిర్వాహకులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

క్రైం న్యూస్

తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై ప్రమాదం

ప్రమాదానికి కారణమైన వాహనాలు, క్షతగాత్రురాలు త్రివేణి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి చెన్నై జాతీయ రహదారి, కైలాసపురం సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మోహన్ కుమార్, త్రివేణి దంపతులు మోటార్ సైకిల్పై శ్రీకాళహస్తి నుంచి తిరుత్తణి వైపు వెళుతూ, బీజీటి కంపెనీకి చెందిన ట్యాంకర్ లారీని ఓవర్టేక్ చేసే క్రమంలో బైక్, ట్యాంకర్ను రాసుకోవడంతో బైక్ అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో త్రివేణి తీవ్రమైన గాయాల పాలైంది. ఆమె కాళ్లు నుజ్జునుజ్జు అయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని త్రివేణిని నగరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుండి మెరుగైన చికిత్స కోసం చెన్నై హాస్పిటల్కు తరలించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు నుండి చిన్నరాజు కుప్పం వైపు వెళ్తున్న ఆటో రోడ్డు ప్రమాదానికి గురైంది. వివరాల్లోకి వెళితే వేగంగా వెళ్తున్న ఆటో ఆరేటమ్మ ఆలయం వద్ద, కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి రోడ్డు అవతలివైపుకు బోల్తా పడటంతో ఆటోలో ఉన్న నలుగురు ప్రయాణికులు గాయాలపాలయ్యారు. స్థానికులు గమనించి క్షతగాత్రులను సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదుపుతప్పి లారీబోల్తా

ప్రజాశక్తి - నాయుడు పేట: వడ్ల లోడుతో బద్వేల్ నుంచి చెన్నైకి వెళుతున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలవలో బోల్తా పడ్డ సంఘటన నాయుడుపేట మండల పరిధిలోని, చలివేంద్రం గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. చుట్టుపక్కల వారి సమాచారం మేరకు ఉమ్మడి కడప జిల్లా బద్వేలు నుంచి వడ్ల లోడుతో చెన్నై వెళుతున్న ఏపీ 26 టిఓ 5238 నంబరు గల లారీ నాయుడుపేట మండల మేనకూరు సమీపంలోని చలివేంద్రం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇవ్వబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న కాలవలో బోల్తా పడింది. చుట్టుపక్కల వారు వెంటనే స్పందించి లారీ డ్రైవర్ను, క్లీనర్ను సురక్షితంగా బయటకు తీశారు. వారు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారని, ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణాపాయం జరగలేదని గ్రామస్తులు తెలియజేశారు. బోల్తా పడ్డ లారీలో ఉన్న వడ్లను మరొక లారీలోకి మార్చి ప్రమాదానికి గురైన వారిని ప్రథమ చికిత్స నిమిత్తం నాయుడుపేట పట్టణంలోని వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు పట్టణం, దలవాయి అగ్రహారానికి చెందిన యువకుడు సుదర్శన్ (22) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానిక ఎస్సై రామస్వామి తెలిపిన వివరాల మేరకు సుదర్శన్ శ్రీ సిటీ పారిశ్రామికవాడ, హీరో మోటార్స్ కంపెనీలో విధులు నిర్వహించేవాడు. నవంబర్ 24న రాత్రి కంపెనీలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా, సత్యవేడు- శ్రీకాళహస్తి ప్రధాన రహదారిపై ఇందిరాపురం గ్రామం వద్ద రోడ్డుపై హఠాత్తుగా పశువులు అడ్డు రావడంతో తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. స్థానికులు గుర్తించి సుదర్శన్ను 108 ద్వారా సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం తల్లిదండ్రులు చెన్నై ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో సోమవారం చికిత్స ఫలించక సుదర్శన్ మృతి చెందినట్లు తెలిపారు.


సుదర్శన్ (ఫైల్ ఫోటో)

ఎర్రచందనం స్మగ్లర్లకు జైలు శిక్ష

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటుగా ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు ఆర్ఎస్ఎస్ న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పును వెలువరించారు. చిత్తూరు జిల్లా సదువు మండలానికి చెందిన ముద్దాయిలు పగడాల వెంకటరమణ, మల్లెల హరినాథ ఇద్దరు వ్యక్తులు కలసి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ 2018 జనవరి 25వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగార్జున రెడ్డికి పట్టుబడ్డారు. దీనిపై పకడ్బందీ ఆధారాలు కోర్టుకు విచారణ సందర్భంగా పోలీసులు సమర్పించారు. ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నియమితులకు శిక్ష విధిస్తూ తీర్పును ఇచ్చారు. కేసుకు సంబంధించి నిందితులను అదుపులోకి తీసుకొని న్యాయస్థానం ముందు ఉంచిన పోలీసులను చిత్తూరు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

డయల్ యువర్ సిఎండి'కి 62 వినతులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఎపిఎస్పీడీసీఎల్ నిర్వహించిన “డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి” కార్యక్రమానికి 62 వినతులు అందినట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం జరిగింది. సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సిఎండి దష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గత నెల 24వ తేదీ వరకు వరకు మొత్తం 265 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను తెలియజేశారని, 118 సమస్యలను ఇప్పటికే పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు పి. అయూబ్ ఖాన్, కె. గురవయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహావతార్ బాబాజీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణం, మరాఠీగేట్ సమీపం, అమరంకండ్రిగలో సుభద్రమ్మ, శంకర్ నాయుడులకు చెందిన వ్యవసాయ క్షేత్రంలోని శ్రీ మహావతార్ బాబాజీ పిరమిడ్ ధ్యాన ఆశ్రమంలో మహావతార్ బాబాజీ జన్మదిన వేడుకలను పుత్తూరు పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఎంసి ట్రస్ట్ వైస్ చైర్మన్ సుజాత, సంగీత బాబు, శ్రీనివాసులు, జేతవనం ప్రభాకర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభంలో ఫ్లూట్ విధ్వన్ సుబ్రహ్మణ్యం తిరుపతి వారిచే వేణునాద సామూహిక ధ్యానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన సంగీత బాబు, ప్రపంచ శాంతి, ఆనందం, ఆరోగ్యానికి నిరంతరంగా సేవలందిస్తున్న హిమాలయ అమర గురువు మహావతార్ బాబాజీ ఆత్మీయ సేవలను స్మరించారు. అనంతరం పుత్తూరు త్రినేత్ర పిరమిడ్ మాస్టర్లచే కోలాటం నిర్వహించారు.